క్లుప్తంగా

జంపెనలో సామూహిక కుంకుమార్చన



కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: వాసవీమాత వర్ధంతి సందర్భంగా జంపెన వాసవీమాత ఆలయంలో సోమవారం అమ్మవారికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. వాసవీ ఆలయ కమిటీ చైర్మన్ పుట్టా మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కింతలి –గాదిరాయి వాసవీ క్లబ్ పరిధిలోని 300 మంది వాసవీ క్లబ్ సభ్యులు సామూహిక కుంకుమార్చన చేశారు. జోన్ చైర్మన్ శ్రీనాధు కన్నయ్యశెట్టి, రీజనల్ కన్వీనర్ అనపగడ్డ హరిబాబు, జోన్ చైర్మన్ శ్రీనాధు కన్నయ్యశెట్టి, క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి అర్జున రావు, కార్యదర్శి అనపగడ్డ అప్పారావు, పుట్టా కొండారావు, గున్నయ్యశెట్టి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ పొడిగింపుపై హర్షం

దేవరాపల్లి: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ఈ నెల 23వ తేదీతో ముగిసినందున రాష్ట్ర ప్రభుత్వం మరో పదేళ్లు పొడిగించడం హర్షణీయమని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కె. అప్పారావు అన్నారు. దేవరాపల్లిలో సోమవారం ఆయన మాట్లాడుతూ సబ్ ప్లాన్ చట్టాన్ని 2013లో చేయగా సోమవారం నాటితో చట్టం కాలపరిమితి ముగిసిందన్నారు. ఈ నేపథ్యంలో మరో పదేళ్లు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చిందన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ చట్టాన్ని వంద శాతం దళిత, గిరిజనుల ప్రయోజనం కోసం ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి ఎస్సీ యువతకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాకవరపాలెం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్‌ఐ రామకృష్ణారావు సోమవారం తెలిపారు. బూరుగుపాలెం సమీపంలో గెడ్డ నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో దాడి చేశామన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలను పాటించాలి

కె.కోటపాడు: స్థానిక సీహెచ్‌సీలో అదనపు భవనాల నిర్మాణాలు పూర్తయితే మరింత మెరుగైన వైద్యం ప్రజలకు అందనున్నట్లు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. ఇక్కడ రూ.5.60 కోట్లతో చేపడుతున్న అదనపు భవన నిర్మాణాలను సోమవారం వారు పరిశీలించారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఆస్పత్రిలో శానిటేషన్ నిర్వహణపై వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ పనులు మార్చి కల్లా పూర్తి కానున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి వీరికి వివరించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు శ్రీకాంత్ శ్రీను, సర్పంచ్‌లు బండారు దేముళ్లు, కన్నూరు మహాలక్ష్మినాయుడు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై అవగాహన



ఎం. కోటపాడు పాఠశాలలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ

మాడుగుల రూరల్: బాలికల్లో రక్తహీనత రాకుండా తగు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సచివాలయ ఎంఎల్‌హెచ్‌పీ రుక్మిణి స్వాతి తెలిపారు. స్వాభిమాన్‌లో భాగంగా ఎం. కోటపాడు పాఠశాలలో సోమవారం బాలికలకు అవగాహన కల్పించారు. 10 నుంచి 19 ఏళ్ల మధ్య విద్యార్థినులకు లైంగిక వేధింపులు, అనారోగ్య సమస్యలు గురించి వివరించారు. హెచ్‌ఎం చందోలు వెంకటేశ్వర్లు, సర్పంచ్ శానాపతి శేషఫణి, ఏఎన్‌ఎం పుష్ప, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్లబళ్ల పరుగు పోటీలు

- జిల్లా స్థాయి ఎడ్ల పోటీల విజేతగా నర్సయ్యపేట



పరుగు పోటీల్లో దాడు తీస్తున్న ఎడ్లబండి



శివరాంపురంలో హుషారుగా పరుగులు తీస్తున్న ఎద్దులు



మాడుగుల: పూజలు చేస్తున్న భక్తులు



ములకలాపల్లిలో ఎడ్లబళ్ల పోటీల విజేతకు బహుమతి అందజేస్తున్న గ్రామపెద్ద కొండలరావు

దేవరాపల్లి: ములకలాపల్లిలో పైడిమాంబ, ముత్యమాంబ, మరిడిమాంబ అమ్మవార్లు, అచ్చియ్యమ్మ పేరంటాలు తీర్థం పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీలను సర్పంచ్ గొర్లె అన్నపూర్ణ, ఎంపీటీసీ మజ్జి దేవి, కొండలరావు, రాజు తదితర గ్రామ పెద్దలు ప్రారంభించారు. ఈ పోటీల్లో నర్సయ్యపేటకు చెందిన ముమ్మిన రామకృష్ణ ఎడ్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. వల్లంపూడి సిద్ధి వినాయక ఎడ్లు తృతీయ, కలగాడ పోలుపర్తి రామునాయుడు ఎడ్లు నాల్గో స్థానం దక్కించుకున్నాయి. దేవరాపల్లికి చెందిన వీరాంజనేయ ఎడ్లు ఐదు, కె.ఎల్.బి.పట్నానికి చెందిన చిరికి దుర్గా ప్రసాద్ ఎడ్లు ఆరు, ఎం.కొత్తపల్లి మరిడిమాంబ ఎడ్లు ఏడో స్థానంలో నిలిచాయి. వీరికి వరుసగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2వేలు, వెయ్యి రూపాయల చొప్పున బహుమతులను గ్రామ పెద్దలు ప్రదానం చేశారు. అంతకుముందు అమ్మవార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్. శివరాంపురంలో ఆకట్టుకున్న ఎడ్ల పరుగు పందెం

బుచ్చెయ్యపేట: ఆర్. శివరాంపురంలో రాములోరి తీర్థం వైభవంగా జరిగింది. గ్రామస్తుల ఆయురారోగ్యాలతోపాటు సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని గ్రామమంతా సుభిక్షంగా ఉండాలని సర్పంచ్ నమ్మి నీరజ అప్పలరాజుతోపాటు గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్లబళ్ల పరుగు పందెం, ముగ్గులు, కోలాటాలు, తప్పెటగుళ్ల పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. విజేతలకు గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు అందించారు. అప్పంపాలెం, చిన భీమవరం, ఆర్. భీమవరం, ఎం.బి.పాలెం, మల్లాం, రాజాం, తదితర గ్రామాల ప్రజలు అధికంగా పాల్గొన్నారు.

మంచాల ఎడ్లపరుగు విజేత అర్జునగిరి

చీడికాడ: మంచాలలో సీతారామాంజనేయ తీర్థం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీల్లో అర్జునగిరికి చెందిన మరిడిమాంబ బండి విజేతగా నిలిచింది. తర్వాత స్థానాల్లో పైడితల్లమ్మతల్లి (లెక్కలవానిపాలెం), కొయిలాడ మోహన్ (కె.జె.పురం), వేపాడ శంకరరావు (దండిసురవరం)లకు చెందిన బళ్లు నిలిచాయి. వీరికి ఉత్సవ కమిటీ నేతలు బహుమతులు అందించారు.

25న జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం

వరహాపురంలో ఈ నెల 25న జిల్లా స్థాయి ఎడ్లపరుగు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సీతారాముల వారి తీర్థం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా మోదకొండమ్మ తీర్థం

మాడుగుల: ఒమ్మలి గ్రామంలో మోదకొండమ్మ తీర్థం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నేల వేషాలు, రంగులు రాట్నాలు, భారీ విద్యుత్ లైటింగ్ నడుమ తీర్థం ఘనంగా జరిగింది. తెల్లవారు నుంచి గ్రామంతోపాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆలయ చైర్మన్ ఉగ్గిన వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఘనంగా సాధుజగ్గయ్య తీర్థం

మాడుగుల రూరల్: కె.జె.పురం తాచేరు సమీపంలో సాధుజగ్గయ్య గోలి వద్ద సోమవారం తీర్థం నిర్వహించారు. జగ్గయ్య కుటుంబ సభ్యులు ఊరేగింపుగా పసుపు కుంకుమలతో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భీశెట్టి జగ్గారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళిక సిద్ధం



డి.యర్రవరంలో బోరును బాగు చేయిస్తున్న ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు

నాతవరం: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశామని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. ఎం.బెన్నవరం, డి.యర్రవరం, నాతవరం గ్రామాల్లో తాగునీటి పథకాల మోటారుబోర్లు, కుళాయిలను ఆయన సోమవారం పరిశీలించారు. పలుచోట్ల బోర్లు సరిగా పని చేయడంలేదని ప్రజలు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. వెంటనే స్పందించి మరమ్మతులు చేయించారు. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటిపోయే తరుణంలో అదనంగా బోరు పైపులైను స్టాకు సిద్ధం చేశామన్నారు. అవసరమున్న చోట ముందస్తుగా మరమ్మతులు చేసి అదనంగా పైపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జల్ జీవన్ మిషన్‌లో రూ.10 కోట్లతో ఇంటింటికీ కుళాయిల పనులు సకాలంలో పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మండలంలో 16 సచివాలయాలకు రూ.3 లక్షల చొప్పున మంజూరయ్యాయని, వీటితో మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, చినబాబు, సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ వర్కు ఇన్‌స్పెక్టరు రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్వోఎఫ్ఆర్ కోసం ఎవ్వరికీ పైసా ఇవ్వొద్దు



అటవీ హక్కు పత్రాలు ఇస్తున్న తహసీల్దార్ కనకారావు

నాతవరం: అటవీ హక్కు చట్టం ప్రకారం అర్హులకే ఆర్వోఎఫ్ఆర్ పత్రాలు ఇస్తున్నామని తహసీల్దార్ పి.కనకారావు తెలిపారు. సరుగుడు, సుందరకోట పంచాయతీలకు చెందిన కొంత మంది గిరిజనులకు సోమవారం ఆయన అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సూచన మేరకు కలెక్టరు ఆదేశాల ప్రకారం ఇంతవరకు 650 మంది గిరిజనులకు 1,550 ఎకరాలకు పైగా సాగు చేసే భూములకు హక్కు పత్రాలు ఇచ్చామన్నారు. హక్కు పత్రాలు పొంది తమ భూములు ఆన్‌లైన్లో నమోదైన గిరిజనులకు వైఎస్సార్ రైతు భరోసా వర్తిస్తుందన్నారు. అటవీ హక్కు పత్రాలు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని, అధికారులకు ఒక్క పైసా ఇవ్వొద్దన్నారు. ఎవ్వరైనా డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆర్ఐ మధు, నాతవరం, సరుగుడు వీఆర్వోలు బొత్సా శ్రీను, శాంతి కుమారి పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం

- ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అల్లు సూర్యనారాయణ



మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్యనారాయణ

దేవరాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అల్లు సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సిహెచ్. చంద్రశేఖర్‌లతో కలిసి సోమవారం ఆయన స్థల పరిశీలన చేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సూచన మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వీటిని నిర్మిస్తామన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి దేవరాపల్లిలో రెండు సచివాలయాలకు రూ.3 లక్షలు చొప్పున మంజూరయ్యాయన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- గడపగడపకు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



అంభేరుపురంలో మహిళలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించి, అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. అంభేరుపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల మంజూరుపై ఆరా తీశారు. సచివాలయం, వలంటీర్ల పనితీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హతే కొలమానంగా పార్టీలకతీతంగా ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, మహిళా సాధికారత ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని వివరించారు. వ్యవసాయాన్ని పండగ చేయాలని, వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులకు సబ్సిడీ ఇవ్వడంతోపాటు నేరుగా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి పండిన పంటను అక్కడే అమ్ముకునే విధంగా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆదుకుని రైతులకు చెరకు బకాయిలు పూర్తిగా చెల్లించిందన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీల మాజీ ఫ్లోర్ లీడర్ సూరిశెట్టి నాగదుర్గగోవింద, ఎంపీటీసీ శరగడం నాగేశ్వరరావు, సర్పంచ్ కార్లె ఈశ్వరరావు, ఉప సర్పంచ్ దాడి ముత్యాలనాయుడు స్థానిక సమస్యలను ధర్మశ్రీ దృష్టికి తీసుకొచ్చారు. వీటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు దొడ్డి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొడ్డేడ సూర్యనారాయణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, చోడవరం పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని డిమాండ్



చిన గొర్రిగెడ్డలో గ్రామస్తులతో మాట్లాడుతున్న వెంకన్న తదితర్లు

మాడుగుల రూరల్: అవురువాడ పంచాయతీ శివారు గొర్రిగెడ్డ సర్వే నెంబరు 1లో ఈ నెల 16వ తేదీన కలర్ గ్రానైట్ అనుమతుల కోసం కాలుష్య నియంత్రణ మండలి చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణను వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న, డిమాండ్ చేశారు. గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కె. భవానీలతో కలిసి ఆయన సోమవారం అవురువాడ పంచాయతీ శివారు సీతబందల, తుమ్మవానిపాలెం, గొర్రిగెడ్డ గ్రామాల్లో పర్యటించి గ్రానైట్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో దండోరా వేయకుండా కనుమ పండగ రోజున కొంతమంది దళారులతో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో వాయు కాలుష్యం ఎక్కువగా ఉండటం వల్ల ప్రజలు కిడ్నీ, క్యాన్సర్, టీబీ, గర్భకోశ వ్యాధులకు గురివుతున్నారని వాపోయారు.

రూ.2.40 కోట్లతో తారురోడ్డు పనులు ప్రారంభం



రామచంద్రపురం వద్ద భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ అనురాధ, ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు: ప్రజల సురక్షిత ప్రయాణాలకు లింక్ రోడ్ల నిర్మాణాలతోపాటు రోడ్లు మరమ్మతులు చేస్తున్నట్లు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. రామచంద్రపుం నుంచి లంకవానిపాలెం గ్రామాల మధ్య తారురోడ్డు మరమ్మతులతోపాటు కొత్తగా తారురోడ్డు నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ.2.40 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో చేపట్టే పనులకు సోమవారం జెడ్పీటీసీ, ఎంపీపీ భూమి పూజ చేశారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే కె.కోటపాడు మండలం గుండా కింతాడ, దాలివలస, పింద్రంగి, లంకవానిపాలెం గ్రామాల మీదుగా విజయనగరం జిల్లాకు రాకపోకలు సాగించేందుకు వాహనదారులకు వీలుగా ఉంటుందని తెలిపారు. సర్పంచ్‌లు బండారు ఈశ్వరమ్మ, భూమిరెడ్డి దేముళ్లు, ఆదిరెడ్డి రామునాయుడు, జాగరపు వెంకట రామలక్ష్మి, వేచలపు దొరబాబు, బండారు దేముళ్లు, బోళెం కృష్ణారావు, ఎంపీటీసీలు పల్లా కన్నమ్మ, నెక్కల గోపి, ఏటుకూరి రాజేష్, పాటూరి ఈశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల ధ్రువీకరణ పాఠశాలకే పంపిస్తాం

నాతవరం: విద్యార్థులకు కావాల్సిన కుల, ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వం కొత్తగా రూపొందించిన యాప్‌లో అప్లై చేసుకోవాలి, మేము ఆన్‌లైన్లో వాటిని పరిశీలించి వెంటనే మీ పాఠశాలకు పంపిస్తాం అని తహసీల్దార్ పి. కనకారావు తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో వీఆర్వోలతో మాట్లాడారు. ఈ విషయంపై అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు ప్రత్యేకంగా తెలియజేశామన్నారు. మండలంలో ప్రస్తుతం 1,440 మంది విద్యార్థులు ఈ విధంగా పాఠశాలల నుంచి అప్లయి చేశారని, వారందరికి పంపిస్తామన్నారు. రీసర్వే వేగవంతం చేసేందుకు రైతులు సహకరించాలన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ భూములు, గ్రామకంఠాలు, గెడ్డ పొరంబోకు భూములు గుర్తించే కార్యక్రమం చేస్తున్నామన్నారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను ఖాళీ చేయించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వీఆర్వోలను ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, ఆర్ఐలు మధు, నారాయణరావు, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల సేవలో ఎమ్మెల్యే గణేష్



నర్సీపట్నం: దుగ్గాడలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా సోమవారం రాత్రి ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌కు సర్పంచ్ నిద్ర లలిత ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గౌరీ పరమేశ్వరులకు పూజలు చేశారు.

ఆర్డీవో స్పందనకు 33 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందనలో పలు సమస్యలపై 33 అర్జీలు వచ్చాయని ఆర్డీవో హెచ్‌వి.జయరాం తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ముగ్గురు కుమార్తెల్లో పెద్ద కుమార్తె తన పేరున ఉన్న భూమిని రాయించుకుందని, మిగిలిన ఇద్దరు పిల్లలకు న్యాయం చేయాలని రోలుగుంట మండలం బుచ్చంపేట గ్రామానికి చెందిన రెడ్డి రామతల్లి ఆర్డీవోకు ఫిర్యాదు చేసింది. తన భూమిని ఆక్రమించి భయభ్రాంతులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మాకవరపాలెం మండలం పాపయ్యపాలెంకు చెందిన కసిరెడ్డి నాగమణి మొరపెట్టుకుంది. తన తండ్రి రాయించి ఇచ్చిన 35 సెంట్లు భూమికి పట్టాదారు పాసు పుస్తకం ఇప్పించాలని నర్సీపట్నం మండలం గురందరపాలెంకు చెందిన ఎం.అప్పలనాయుడు ఆర్డీవోకు విన్నవించాడు. భూసమస్యలు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, సదరం సర్టిఫికెట్లకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయి. స్పందనలో మున్సిపల్ కమిషనర్ కనకారావు, అధికారులు పాల్గొన్నారు.

26న రక్తదాన శిబిరం

నర్సీపట్నం: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 26న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని క్లబ్ ప్రతినిధులు రాజ్‌కుమార్, పి.నారాయణరావు తెలిపారు. స్థానిక వాసవి కల్యాణ మండపంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశామన్నారు. యువతీ యువకులు అధికంగా హాజరై శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు పెదనందిపల్లి సత్యనారాయణస్వామి తీర్థం

- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా తరలిరానున్న భక్తులు



ముస్తాబైన సత్యనారాయణ స్వామి పురాతన ఆలయం

దేవరాపల్లి: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పెదనందిపల్లి విజయ వెంకట సత్యనారాయణ స్వామి తీర్థానికి సర్వం సిద్ధమైంది. అన్నవరం సత్యన్నారాయణ మూర్తి స్వామి ఆలయం తర్వాత అంతటి విశిష్టత కలిగిన ఇక్కడ ఆలయం వద్ద ఈ తీర్థం మంగళ, బుధవారాలు నిర్వహించనున్నారు. పెదనందిపల్లి, చిననందిపల్లి, మారేపల్లి, చేనులపాలెం, తారువా, ఎం. అలమండ గ్రామాల ప్రజలు ప్రధానంగా ఈ తీర్థం జరుపుకుంటారు. ఏటా మాదిరిగా అత్యంత వైభవంగా ఇక్కడ నిర్వహించే తీర్థానికి ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు హాజరవుతారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బారికేడ్లు, కొండపై ఆలయం వద్దకు మెట్ల మార్గం గుండా చేరుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ డి. నాగేంద్ర ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రత్యేక ఆంక్షలు విధించారు.

రైతు కుటుంబాల నిరసన దీక్ష

రావికమతం: రియల్ ఎస్టేట్ సంస్థ ఆక్రమణలో తమ భూములను తమకు దక్కేలా చేయాలంటూ బాదనపాడు గ్రామానికి చెందిన రైతు కుటుంబాలు నిరసన దీక్ష చేస్తున్నాయి. వృద్ధుల సహా పిల్లా అచ్చారావు కుటుంబ సభ్యులు ఆదివారం ప్రారంభించిన దీక్షను సోమవారం కొనసాగించారు. ఇక్కడ సర్వే నెంబరు 40లో 106 ఎకరాల భూములు కొనుగోలు చేసిన సంస్థ మరో 86 ఎకరాలు ఆక్రమించుకోవడంతోపాటు తమ తండ్రి పేరుతో తమ సాగులో ఉన్న పదెకరాలు కాజేశారని వారి ఆరోపణ. అడిగితే కొనుగోలు చేస్తామని ఇన్నాళ్లా నమ్మించి ఇపుడు కంచె వేసేస్తున్నారని, ఫిర్యాదులు చేసినా అధికార్లు పట్టించుకోవడం లేదంటూ ఆరోపిస్తున్నారు. తమకు జీవనాధారమైన భూమి దౌర్జన్యంగా లాక్కుంటున్నారని, తమ భూమి తమకు వచ్చేవరకూ ఇక్కడే ఉంటామని ప్రాణాలు పోయినా పర్వాలేదని వారన్నారు. నిరసన దీక్షలు చేస్తున్న రైతుల శిబిరాన్ని రావికమతం పోలీసులు, స్పెషల్ బ్రాంచి పోలీసులు, ఆర్ఐ చినబ్బాయి సందర్శించారు. న్యాయం చేస్తామని చెప్పారు. వృద్ధులు చలిలో ఉంటే ప్రాణా లకే ప్రమాదమని వారిని ఇంటికి చేర్చాలని సూచించారు.

నిబంధనలు ఉల్లఘించే వారికి జరిమానా

నాతవరం: నిబంధనలు ఉల్లఘించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ డి. లక్ష్మీనారాయణ హెచ్చరించారు. నర్సీపట్నం - తుని మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఆయన సోమవారం వాహనాలు తనిఖీలు చేశారు. లైసెన్సు లేకుండా డ్రైవింగ్ చేసే వారికి జరిమానా విధించారు. వాహనాలు తనిఖీలు చేయడంతో ఈ ఏడాది పండగ సమయంలో రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు.

వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి

నర్సీపట్నం: జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా నర్సీపట్నం టౌన్ పోలీసులు సోమవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది తలకు బలమైన గాయాలు తగలటం వల్లే మృత్యువాత పడుతున్నారని పట్టణ సీఐ ఎన్.గణేష్ అన్నారు. వాహనదారులు విధిగా హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలన్నారు. టౌన్ ఎస్సై గోవిందరావు పాల్గొన్నారు.



వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ గణేష్